ఊరి చివరనున్న కోనేటి గట్టుపై కూర్చుని శూన్యంలోకి చూస్తున్నాడు రఘు. అతని మనసు బాధతో సుళ్ళు తిరుగుతూంది -

**వూళ్ళోంచి మంగళ వాయిద్యాలు గాలిలో తేలి, చిన్నగా అతని చెవిని పడ్తున్నాయి.**

'ఈ వేళే మాధవి పెళ్ళి..." గొణుక్కున్నాడు. ఆ వేళ వుదయం నుండి చాలా సార్లనుకున్నాడలా.

కాస్సేపటికి లోకమంతా చిక్కని చీకటి వడిలోకి జారిపోయింది. పరిసరాల్ని గమనించే స్థితిలో లేడు. గటు మీద వెల్లకిలా పడుకుని ఆకాశంలోకి చూస్తు న్నాడు. అప్పుడప్పుడు పిచ్చివానిలా నవ్వుకుంటున్నాడు. మాధవి జ్ఞాపకాలు అతన్ని రంపపు కోత కోస్తున్నాయి- శిథిలాల్లో చిక్కుకు పోయిన గతాన్ని తవ్వుతోందతని మనసు.

తను గ్రాడ్యుయేట్ అయేసరికి అంతంత మాత్రంగా నున్న ఇంటి పరిస్థితి మరింత దిగజారింది. పూట గడవటం కష్టంగా వుంది-పట్నంలో నున్న నాయుడు గారి ఆయిల్ మిల్లులో పద్దులు రాసి రాసి తండ్రి అలిసిపోయాడు. కాలేజీకి పంపే స్తోమతు లేక హైస్కూలు చదువుతోనే ఆగిపోయిన తమ్ముడు- ఈమధ్యనే బడి మానేసిన చెల్లెలు!

నడి సముద్రంలో దీపం లేని నావలా వుంది కుటుంబ పరిస్థితి.

ఆ మారుమూల వుండే గ్రామంలో పిల్లలకు ట్యూషన్లు చెపుతూ ఎప్పటికైనా వుద్యోగం దొరక్కపోతుందా అనే గంపడాశతో కాలం గడుపుతున్నాడు తను.

ఒక రోజు నాయుడుగారు తన ఇంటికి పిలిపించి అడిగారు-వాళ్ళ రెండో అమ్మాయి లతకు ట్యూషన్ చెప్పమని. ఇంటికి వెళ్ళి చెప్పటం ఇష్టం లేకపోయినా కాదనలేక పోయాడు. ఆ వూళ్ళో నాయుడుగారు మకుటం లేని మహారాజు!

"మా సిస్టర్‌కి లెక్క లసలు రావండీ-మరెలా దాన్ని గట్టెక్కిస్తారో..." లత ప్రక్కగా వచ్చి కూర్చుంటూ అంది మాధవి తను ట్యూషన్ మొదలు పెట్టిన్నాడు.

ఒకటి రెండు సార్లు ఇదివరలో ఆమెను చూశాడేమో తనకి గుర్తు లేదు. కాని ఆ వేళ చూశాడామెను. తొలిసారిగా పున్నమి రోజున వెన్నెల్లో మెరుస్తున్న ఆకాశాన్ని చూసిన అనుభూతి! విశాలమైన పెద్ద కళ్ళు. సముద్రం లాంటి ఒత్తైన జుట్టు-అప్పుడే మెరుగు పెట్టిన పసిడి బొమ్మలా వుంది మాధవి.

"అలాగే-నా ప్రయత్నం నేను చేస్తాను" అన్నాడు బిడియ పడ్తూ. ఆమె ఎదురుగా కూచోవటం తనకిబ్బందిగా వుందారోజంతా. ఆమె అక్కడున్నంతసేపూ నోరు మెదపలేక పోయాడు.

పగలంతా ఆమె ధ్యాసతో సాయంత్రం ఎప్పుడవుతుందాని ఎదురు చూసేవాడు. రోజూ తను వచ్చే వేళకు గుమ్మంలో నిల్చుని తను రావటం చూడగానే లోనికి వెళిపోతూ వుండటం కన్పించేది.

ఆ వేళ సాయంత్రం నాయుడుగారింటికెళ్దామనుకుంటుండగా చీకటి పడింది. ఆ పూటకు వెళ్ళటం మానేద్దామనిపించింది. కానీ మాధవిని చూడకుండా ఒక్క రోజు కూడా వుండలేనని ఆ వేళే తెలిసింది.

"రండి మాష్టారూ! అమ్మా, నాన్న పట్నం వెళ్ళారు. వచ్చేస్తారు-లతా! మాష్టారొచ్చారు" చెల్లెల్ని పిలిచింది మాధవి తను వెళ్ళగానే.

వరండాలో కూచుని లతకు పాఠం చెప్తున్నాడు.

తొమ్మిదాటుతూంది. ఊళ్ళో కొస్తున్న బస్సు శబ్దం వినిపించింది. పట్నం నుంచొచ్చే ఆఖరు బస్సది.

"వాళ్ళీపూట రాకపోతే బాగుణ్ను" ఎందుకో తనకలా అనిపించింది. గుండె లోతుల్లో చిన్నగా రాజుకుంటున్న వయసు సెగళ్ళు.

"అమ్మా వాళ్ళు రానేలేదీ బస్సులో!" వీధి గుమ్మంలోంచి వస్తూనే అంది మాధవి.

లత నిద్రవస్తోందంటూ వెళ్ళి పడుకుంది. వూరంతా సద్దుమణిగింది. మాధవి తనకెదురుగా నిల్చుంది. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి తనకు. ఇంట్లో ఎవరూ లేనపుడు తను వుండటం బాగోదనిపించింది.

"వస్తాను..." లేచాడు తను వెళ్ళిపోవడాన్కి. మాధవి జవాబు చెప్పకుండా నేల చూపులు చూస్తోంది.

"వెళ్ళొస్తాను..." మళ్ళీ చెప్పాడు. గొంతు పొడారి పోతున్నట్టుగా వుంది తనకు.

"రాజయ్య కూడా అమ్మా వాళ్ళతో వెళ్ళాడు-లత భయమంటూంది..." మెట్లు దిగుతూంటే ఆమె మెల్లగా అంది. మరి కాస్సేపుండి పోదామనిపించింది తనకు. వరండాలో కొచ్చి కూర్చున్నాడు. అంతా నిశ్శబ్దం ఒకరి గుండెల సవ్వడి మరొకరికి స్పష్టంగా వినిపిస్తోంది.

"రండి...అలా పెరట్లో కూర్చుందాం" మాధవి అంది చిన్నగా.

ఆమె ముందు నడుస్తూంటే రెండు గదులు దాటి పెరట్లోకొచ్చారు ఇద్దరూ.

విశాలమైన పెద్ద పెరడు. చుట్టూ ప్రహరీ-అందమైన తోట. కార్తీక మాసం వెన్నెల మంచుతో తడిసి కురుస్తోంది తోటంతా.

నూతి పళ్ళెం మీద కూర్చున్నారిద్దరూ. చంద్రుడ్ని చూస్తోంది మాధవి నూతి గట్టునానుకుని. ఆమెను చూస్తున్నాడు తను. అంత సౌందర్యం తనెప్పుడూ చూడలేదు. వెన్నెల కెరటాలు ఆమె కంఠాన్ని తాకి పయ్యెదలోకి జలపాతంలా దుముకుతున్నాయి.

తను కలగంటున్నాడేమోననుకున్నాడు.

అనుక్షణం ఆరాధించే దేవత ఈవేళ తనకు దగ్గరగా- ఏకాంతంగా తన కోసమే లోకాలన్నీ వదిలి వచ్చిన దేవతలా వుంది.

విచ్చుకుంటున్న రాత్రి పూల పరిమళం తోటంతా అల్లుకుంటూంది. మాధవి తదేకంగా వెన్నెల్ని చూస్తోంది. ఆమెకు దగ్గరగా జరిగి ఆమె భుజాల్ని పెదవుల్తో స్పృశించాడు తను. ఆమె కురులు వుప్పెనలా తనను కప్పేశాయి. మంచి గంధం వాసన తనకు వూపిరి సలపటం లేదు. తన కంఠాన్ని చుట్టిన ఆమె బాహువులు ఆమె మెత్తని గుండెలపై తన ముఖం చిక్కుకుని ఎక్కడో మరో లోకంలో కళ్ళు తెరచిన అనుభూతి.

తెల్లవార్లూ వెన్నెట్లో తడిసి పోయారిద్దరూ. ఆకాశంలో చంద్రుడు బాగా క్రిందికి దిగాడు.

తన ఒడిలో నిద్రిస్తున్నామెను మెల్లగా వదిలి గబగబా ఇంటికి వచ్చేశాడు తను.

అంతే-

తర్వాత ఎంత ప్రయత్నించినా మాట్లాడుకోటానికైనా అవకాశం చిక్కలేదు ఇద్దరికీ. ఒక్కోసారి తన కోసం ఆమె పడే ఆరాటం ఆమె కళ్ళల్లో కన్పించి వివశుడ్ని చేసేది.

ఒకరోజు నాయుడుగారు పట్నం వెళ్ళారు కోర్టు వ్యవహారం. వరండాలో కూచున్నాడు తను. లత రాసుకుంటూంది.

"మనం పెళ్ళి చేసుకుందామంటే - ఎలా బతగ్గలమా అనే నా మీ సందేహం - మీకుద్యోగం దొరికేవరకూ ... ఇవి...ఇవి ... చాలవా?" దగ్గర వచ్చి అంది మాధవి తన ఒంటి మీదున్న ఖరీదైన నగల్ని చూపిస్తూ.

తొట్రుపాటు పడ్డాడు. ఆమెకేం జవాబు చెప్పాలో తెలియక వెంటనే వచ్చేశాడు అక్కడ్నుంచి.

తర్వాత ఒక రోజు-

"మా వాళ్ళు సంబంధం ఖాయం చేశారు ఈ నెల్లోనే. ముహూర్తాలు పెట్టేస్తారట - మిమ్మల్ని వదిలి బ్రతక లేనండీ' వణుకుతున్న చేతుల్తో తటాలున తన పాదాలని స్పృశించింది. ఆ హఠాత్పరిణామానికి ఒళ్ళంతా చెమటతో తడిసి పోయింది తనకి.

ఆ క్షణం - కళ్ళనిండా ఆశల తోరణాలు నింపుకుని తన్ను ప్రాధేయపూర్వకంగా చూసిన ఆమె చూపు గుర్తుకొచ్చి రఘు నిశ్శబ్దంగా రోదిస్తున్నాడు.

-కాని తనేం చేశాడు! ఆ వేళ నుంచే తప్పించు కుని తిరిగాడు. మాధవితో వూరొదిలి వెళ్ళిపోతే! తన మీదే ఆశలు పెట్టుకున్న తన వాళ్ళ సంగతి! నాయుడు గారు కోపంతో బుసలు కొడ్తారు. ఆయన తలచుకుంటే వూళ్ళో నిలువ నీడ లేకుండా చేయగల్గడు- తన మూలంగా అమాయకులైన తన వాళ్ళందరూ వీధిన పడ్తారు. కుటుంబం చిన్నాభిన్నమవుతుంది.

లత పరీక్షలు అయిపోవడంతో మరి వెళ్ళలేదు మాధవి ఇంటికి. ఆమెను తను అన్యాయం చేశాడు. ద్రోహం చేశాడు. తనొక ఇడియట్ - అస్పష్టంగా

15-2-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక



# ప్లీజ్, నన్ను మర్చిపో...

-మణిపాత్రుని రామకృష్ణారావు

* * *

అతి కష్టంమీద విజయివాడలో నున్న ప్రైవేటు కంపెనీలో వుద్యోగం వచ్చింది రఘుకి. ఎకౌంట్సు సెక్షన్‌లో గుమస్తాగిరి. ఓ రోజు ఏవో వివరాలు కావల్సొచ్చి వెళ్ళాడు ఫ్యాక్టరీకి. అక్కడున్న ప్లాంటు ఇన్‌ఛార్జిని చూసి ఆశ్చర్యపోయాడు. అతను ... మాధవి భర్త!

తనది, మాధవిది ఒకే వూరని తెల్సి చాలా అభిమానంగా మాట్లాడేడు.

''అంటే - మా మాధవి మీకు బాగా తెలిసుండాలే?'' అడిగాడతను.

''ఊ- ఉహూ'' తడబడ్డాడు రఘు.

రఘుని ఇన్‌వైట్ చేశాడు ఒక ఆదివారం ఇంటికి రమ్మని.

ఆదివారం వుదయాన్నే వెళ్ళేడు మాధవి ఇంటికి.

సాదరంగా ఆహ్వానించారు భార్యా భర్తలిద్దరూ. అందరూ కలిసి బ్రేక్‌ఫాస్టు చేశారు.

''ఊళ్ళో అమ్మా వాళ్ళందరూ కులాసానా?'' అడిగింది మాధవి. చాలా రోజుల తర్వాత సొంత వూళ్ళో వాళ్ళెవరైనా కన్పిస్తే అడిగే కుశల ప్రశ్నల్లా వున్నాయనిపించింది రఘుకి.

''ఆ...ఊ'' అంటూ ముక్తసరిగా జవాబిచ్చాడు.

''వస్తుండండి... ఆదివారాల్లో'' ఆమె భర్త తను వచ్చేస్తుంటే అన్నాడు.

రఘు మనసు కొత్త చిగుళ్ళు వేస్తూంది. ఎండి బీటలు వారిన సెలయేటికి వరదొచ్చినట్లుగా వుందతనికి!

ఆ మరుసటి ఆదివారం వెళ్ళాడు మాధవి ఇంటికి.

''రండి మాష్టారూ! కూర్చోండి. ఇప్పుడే తను ఫ్యాక్టరీ కెళ్ళారు ఏదో బ్రేక్ డౌన్ వచ్చిందని ఫోనొస్తే- వచ్చేస్తారు'' చిరునవ్వుతో అంది రఘుని చూడగానే.

ఆమె కెదురుగా సోఫాలో కూర్చున్నాడు.

''ఇప్పుడే స్నానం చేసినట్లుంది'' అనుకున్నాడు. ఆమె రవికె మీద అక్కడక్కడ ఇరికిన నీటి బిందువులను చూసి ఆనాటి వెన్నెల్లో తడిసిన సౌందర్యం అతని కళ్ళ ముందు కదిలింది.

''మాధవీ!'' చనువుగా పిల్చాడు.

తలెత్తి ఏమిటన్నట్లుగా చూసింది.

''మాధవీ! నీకు ఏమీ అన్పించటం లేదా? మరలా నన్నిలా చూడ్డం...'' టీపాయ్ మీదున్న మేగ్‌జైన్ చేతిలోకి తీసుకుని ఆమె సమాధానం కోసం ఆత్రంగా చూస్తున్నాడు. అతని అరచేతులు చిన్నగా చెమట్లు పద్తున్నాయి.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం-

''మాధవీ! ఏం మాట్లాడవు?'' పుస్తకంలోంచి తలెత్తకుండానే అడిగాడు.

''మాష్టారూ! ఇంకెప్పుడూ మా ఇంటికి రాకండి - పిరికితనం మగవాడికి శాపం లాంటిది- అవకాశం దొరికితే అన్నీ పొందాలని చూస్తాడు- కాని దేన్నీ సాధించలేడు - పిరికి గుండెగల మగాడ్ని ప్రేమించటం కంటే స్త్రీకి నరకం మరొకటి లేదు- వద్దు మాష్టారూ! మీరిలా మా ఇంటికి వస్తూ పోతుండడం - ప్లీజ్! ఇక్కడ్నించి వెళ్ళిపోండి'' దోసిట్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

రఘు నిశ్చేష్టుడయ్యాడు. ఈ పరిస్థితి వూహించలేదతను. మాధవి ముందు తనొక ఇసుక రేణువై భూమి లోపలికి కుంచించుకు పోతున్నట్లుగా వుంది. అక్కడ్నించి లేచి గబగబా బయటకు నడిచాడు.

మాధవి మాటలు తేనెటీగల్లా వెంటాడుతూనే వున్నాయతన్ని!

◆